ప్రజాశక్తి

ఆదివారం 30 జూన్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

జిజిహెచ్‌లో అత్యవసర విభాగాన్ని పరిశీలిస్తున్న మంత్రి చంద్రశేఖర్

అవసరమైతే విజిలెన్స్ విచారణ

- జిజిహెచ్‌లో నిర్మాణాలపై కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్
- ఆస్పత్రిలో పరిశీలన - పలు అంశాలపై ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు బాధ్యతగా పనిచేయాలని, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిజిహెచ్‌ను శనివారం సందర్శించిన ఆయన అత్యవసర వైద్యవిభాగంలో రోగులకు అందిస్తున్న సేవలను, నిర్మాణంలో ఉన్న భవనాల పనులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రి ప్రాథమిక వివరాలు, వైద్యవిభాగాలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యపరీక్షలు, మౌలిక సౌకర్యాలు, అభివృద్ధి పనులు, జింకాన, నాట్కో ట్రస్టుల ద్వారా అందిస్తున్న వైద్యసేవలు విభాగాల వారీగా పరిష్కరించాల్సిన సమస్యలపై జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, విభాగాల అధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీటీస్కాన్‌కు సంబంధిత ఏజెన్సీ ద్వారా తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని, ఏజెన్సీ స్పందించకపోతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతాశిశుసంరక్షణ భవన సముదాయ నిర్మాణం పూర్తయ్యే సమయానికి అందులో అవసరమైన పరికరాల సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిజిహెచ్‌కు కేటాయించిన కార్మిక శాఖ స్థలంలో నిర్మించాల్సిన వైద్యవిభాగంపై ప్రతిపాదనలు అందించాలన్నారు. డైట్‌క్యాంటిన్ నిర్మాణానికి, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీని వెంటనే ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని ఆసుపత్రిలోని సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రిలో అభివృద్ధి పనుల నిర్మాణాలను పూర్తి స్థాయిలో పరిశీలించి అవసరమైతే ▶ 2లో

నిలదీసిన మంత్రి

నీళ్లునమిలిన అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమీక్షలో మంత్రి అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సూపరింటెండెంట్ తోపాటు ఇతర వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పార్కింగ్, సి.టి స్కాన్ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ఎమర్జెన్సీ వార్డు రిస్ట్రక్చర్, ఈ.సీ.జీ యంత్రాల అదనపు అవసరాలను వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ పార్కింగ్ ప్రాంగణం విస్తరించాలని, రోగుల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరారు. ఏడాది కాలంగా సి.టి స్కాన్ పనిచేయడం లేదని, సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించినా స్పందించడం లేదని సూపరిండెంట్ చెప్పగా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సి.టి స్కాన్ యంత్రాలకు రిపేర్లు పూర్తి చేయించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు వెయిటింగ్ హాలు నిర్మాణంలో జాప్యం ఎందుకు జరుగుతుందని ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. నిర్మాణాల కాంట్రాక్టులపై విజిలెన్స్ విచారణకు కలెక్టర్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో ఏసీలు తరచూ రిపేర్లు రావడం, లిఫ్టులు పనిచేయకపో వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహాప్రస్థానం వాహనాలను రాత్రి వేళలో అందుబాటులో ఉంచాలన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో, కేన్సర్ విభాగంలో వైసిపి నాయకుల పుట్టిన రోజుల వేడుకలు ఎలా చేస్తారని, అందులో మీరెలా పాల్గొంటారని సూపరింటెండెంట్‌ను మంత్రి నిలదీశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పుట్టిన రోజుల వేడుకల సందర్భంగా జరిగిన హంగామాను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

రేపు పెనుమాకలో సిఎం పర్యటన

పింఛన్లను పంపిణీ చేయనున్న చంద్రబాబు - ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

తాడేపల్లి మండలం పెనుమాకలో సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న నేపథ్యంలో అధికారులందరు సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెనుమాకలో పింఛన్ల పంపిణీ అనంతరం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో ముఖాముఖీ మాట్లాడతారన్నారు. ▶ 2లో

రణరంగాన్ని తలపించిన సిఆర్‌డిఏ సమావేశం

నేడు రైతుల అభిప్రాయ సేకరణకు డిప్యూటీ కమిషనర్ ప్రకటన

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఆర్‌డిఏ డిప్యూటీ కమిషనర్ ఎం.విశ్వేశ్వరనాయుడు శనివారం ఉండవల్లి సెంటర్‌లోని సచివాలయంలో నిర్వహించిన సీడ్ యాక్సిస్ రోడ్డు రైతుల సమావేశం రణరంగాన్ని తలపించింది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సీడ్ యాక్సిస్ రోడ్డు భూ సమీకరణ కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి పెనుమాక, ఉండవల్లి నుంచి పెద్దఎత్తున రైతులు హాజరయ్యారు. సీడ్ యాక్సిస్ బాధితులు కాని వారు, రెండు గ్రామాల్లో భూములున్న రైతులు కూడా సమావేశానికి హాజరు కావడం వల్ల రసాభాసగా మారిందని కొందరు రైతులు విమర్శించారు. రాజకీయ రంగు పులుముకున్న ఈ సమావేశం రాజధాని అభివృద్ధి, సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణానికి అనుకూలంగా కొందరు మాట్లాడారు. మరికొందరు తమ భూములు ప్రస్తుతం రూ.ఐదారు కోట్లకు అమ్ముతున్నాయని, ఎప్పుడో 2014లో నిర్ణయించిన దాని ప్రకారం తమకు ప్లాట్లు ఇస్తామంటే కుదరదని పట్టుబట్టారు. సమావేశం మాత్రమేనని పత్రికల్లో చూశామని, ఇప్పుడు అభిప్రాయాలు ఎలా చెబుతామని ప్రశ్నించారు. సమావేశాన్ని ఆదివారం జరపాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. అందుకు ఆయన అంగీకరించి ▶ 2లో

జాతీయ లోక్ అదాలత్‌లో 1454 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి ఆధ్వర్యములో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న రాజీ పడదగిన కేసులు పరిష్కరించారు. కడపటి సమాచారం అందేసరికి సివిల్ కేసులు 166, కిమినల్ కేసులు 708, చెక్ బౌన్స కేసులు 202, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 152, వివాహ సంబంధ కేసులు 80, బ్యాంకు కేసులు 6, ప్రీ-లిటిగేషన్ కేసులు 140, మొత్తం 1454 కేసులు పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల విలువ మొత్తం రూ.38 కోట్ల 24 లక్షల 12 వేల 474 ఉంటుంది.

వీసీ రాజీనామా చేయాలి

- ఛాంబర్‌ను ముట్టడించి తాళం వేసిన టిఎన్‌ఎస్‌ఎఫ్
- ప్రభుత్వానికి రాజీనామా లేఖ పంపుతానని వీసీ ప్రకటన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ రాజీనామా చేయాలంటూ తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో వీసీ ఛాంబర్‌ను శనివారం ముట్టడించారు. వీసీ కార్యాలయానికి తాళాలేశారు. అయితే ఆ సమయంలో వీసీ కార్యాలయంలో లేరు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీసీ అయి ఉండి వైసిపి కార్యకర్త మాదిరి వ్యవహరించారని విమర్శించారు. ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇ.శ్రీనివాసరెడ్డి వైసిపికి అనుకూలంగా, టిడిపికి వ్యతిరేకంగా మాట్లాడారని, ఆయనా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అరగంట పాటు తెలిపిన నిరసనలో టిఎన్‌ఎస్‌ఎఫ్ వర్సిటీ అధ్యక్షులు నితీష్ యాదవ్, నాయకులు భాగ్యరాజు, శ్రీను, అవినాష్, ▶ 2లో



అవసరమైతే విజిలెన్స్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

విజిలెన్స్ శాఖ ద్వారా విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి సూచించారు. భవిష్యత్తు అవసరాల దృష్టిలో పెట్టుకుని అవసరమైన వైద్యులతో పాటు, ఇతర సిబ్బంది నియామకాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వైద్యపరీక్షలు, లిఫ్టులు, ఏసీల మరమ్మతు వంటి చిన్నచిన్న పనులు వెంటనే చేపట్టాలని చెప్పారు. ప్రజాప్రతినిధుల ప్రైవేటు కార్యక్రమాలను ఆసుపత్రిలో నిర్వహించవద్దని, వాటిలో వైద్యులు పాల్గొనరాదని అన్నారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్ పలు అంశాలపై సూచనలు చేశారు. కేంద్రీకృతంగా ఉన్న వైద్యపరికరాల ఇతర సేవల నిర్వహణను వికేంద్రీకరించాలన్నారు. ఆసుపత్రిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిటికె రెడ్డి, ఆర్‌జెడ్ఇ సిహెచ్ సుధారాణి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ బీవీ సతీష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, ఏడీ సీహెచ్ నాగేశ్వరరావు, జింకాన కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలబాస్కర్, నాట్కో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ వై.అశోక్, బయోమెడికల్ ఇంజినీరు చంద్రశేఖర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు పెనుమాకలో సిఎం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పోలీసు శాఖాధికారులు బందోబస్తు ఏర్పాట్లు, ఆర్అండ్‌బి అధికారులు బారికేడింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలన్నారు. సమావేశంలో జెసి రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్‌ఒ పి.రోజా, ఆర్డీవో పి.శ్రీఖర్, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, సిపిఒ శేషశ్రీ, డిఈఒ శైలజ, డిఎస్‌ఒ కోమలి పద్మ పాల్గొన్నారు.

రణరంగాన్ని తలపించిన సిఆర్‌డిఎ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉండవల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికే రెండు గ్రూపులుగా విడిపోయిన రైతులు సమావేశం వేదిక నుంచి రోడ్డు మీదకు వచ్చి మీడియా ముందు తమ వాదనలు వినిపించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కొందరు కోరగా మరికొందరు దానిని వ్యతిరేకించారు. ఇప్పటికే కోట్ల రూపాయల్లోకి వెళ్లిన తమ భూములకు గతంలో ప్రకటించినట్లు కాకుండా జరీబ్ భూములకు 2400 గజాలు, మెట్ట భూములకు 2 వేల గజాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు ధరల్లేని ఐనవోలు, నీరుకొండ, నిడమర్రు, కురగల్లు తదితర భూములతో కలిపి విలువైన తమ భూములకు కూడా ఒకే దామాషా ప్రకారం ప్లాట్లు కేటాయిస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఉండవల్లి, పెనుమాకల్లో ఈ భూములు తప్ప తమకు జీవనాధారం లేదని, 24 గంటలూ భూమి మీద బతికే సన్న, చిన్నకారు రైతులమని, తమకు గౌరవపదమైన నష్టపరిహారం ఇస్తేనే ముందుకొస్తామని తెలిపారు. మరికొంత మంది రైతులు తమ భూమికి భూమి ఇవ్వాలని కోరారు. మరికొంత మంది మాట్లాడుతూ రాజధాని అభివృద్ధికి ఆటంకం కలిగించడం తగదన్నారు. రాజధాని ఇక్కడే ఉండాలంటున్న వారు అభివృద్ధికి ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. రాజధాని అభివృద్ధికి ఎవరూ ఆటంకాలు సృష్టించవద్దని కోరారు. ఈ గందరగోళం రసాభాసల మధ్యే సిఆర్‌డిఎ డిప్యూటీ కమిషనర్ సమావేశం నుంచి వెళ్లిపోయారు.

వీసీ రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

రామకృష్ణ, యశ్వంత్, ఖాయుమ్, జనసేన వర్సిటీ అధ్యక్షుడు జగదీష్, పవన్ సాయి పాల్గొన్నారు పాల్గొన్నారు.

రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపుతా

ఇదిలా ఉండగా కొద్దిరోజుల కిందట రాజధాని రైతులు సైతం వీసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఆయన ఛాంబర్ ఎదుట నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో వీసీ రాజశేఖర్ శనివారం ఒ ప్రకటనలో స్పందించారు. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు రాజీనామా చేస్తానని, రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపుతానని పేర్కొన్నారు.

మత్స్య సహకార సంఘాల వ్యాపారం పెంపుదలకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

మత్స్య సహకార సంఘాలను ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో చేపల రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్యలుగా ఏర్పాటు చేసి, తద్వారా వ్యాపార కార్యకలాపాలు బలోపేతం చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి పి.గాలిదేముడు పేర్కొన్నారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ఏడు మత్స్య సహకార సంఘాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గాలిదేముడు మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాల వ్యాపార కార్యకలాపాలుగా మార్పు చేయటం ద్వారా సంఘ సభ్యుల వ్యాపార లావాదేవీల నిర్వహణకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) ద్వారా మేనేజ్‌మెంట్ కాస్ట్, ఈక్విటీ గ్రాంట్‌లను పొందటానికి సమర్పించాల్సిన సంఘ తీర్మానాలు, సభ్యులకు సంబంధించిన షేర్లపై సంఘాలు

మాట్లాడుతున్న గాలిదేముడు

నిర్వహించే వ్యాపారానికి సంబంధించిన యాక్షన్‌ప్లాన్‌పై అవగాహన కల్పించారు. సహకార వ్యవస్థ ఏర్పాటు విశిష్టతలపై, సహకార సంఘం పాటించాల్సిన నిబంధనలపై కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి ఎండి.జైనుల్లాఖాన్, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ తరపున ముత్యాలరామ్మోహనరావు, కో-ఆర్డినేటర్ వేదాంతంరెడ్డి హాజరయ్యారు.

జన్మభూమి తెనాలిని ఏనాడూ మరువను : చంద్రశేఖర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం తొలిసారిగా తన సొంతూరైన బుర్రిపాలెం రాగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. మార్గం మధ్యలో తన తండ్రి పెమ్మసాని సాంబశివరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తన గెలుపులో పాత్రులైన ఓటర్లకు సదా పాత్రుడనై ఉంటానన్నారు. కూటమి విజయానికి కృషి చేసిన పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి పాలనను అంతమొందిస్తామని, రైల్వే నవీనకరణకు కృషి చేస్తామని చెప్పారు. జన్మభూమిని ఎన్నడూ మరువనన్నారు.

హ్యాకథాన్ పోటీల్లో ఆర్‌విఆర్‌కు ప్రథమ స్థానం

విద్యార్థులను అభినందిస్తున్న సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

తమ కళాశాల విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాల ప్రదర్శనలకు లభించే పురస్కారాలతో కళాశాల కీర్తి జాతీయ స్థాయిలో దూసుకెళుతుండటం ఎంతో గర్వకారణమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఐఈఈఈ సహకారంతో నిర్వహించిన జాతీయ స్థాయి 48 గంటగల హ్యాకథాన్ పోటీల్లో ఐఒటి డొమైన్ విభాగంలో ఆర్‌విఆర్ ఈసిఈ బ్రాంచ్ 4వ సంవత్సరం విద్యార్థులు ఐ.ఘనశ్యామ్, ఎస్.ఆదిశయం బోస్, కె.నిఖిత, సిహెచ్.ఇంద్రజ రూపొందించిన రిమోట్ హెల్త్ మానిటరింగ్ అనే పరికరం నూతన ఆవిష్కరణ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, నగదు పురస్కారం అందుకుందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ విద్యార్థులను అభినందించి, మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో నెలకొన్న పోటీతత్వంలో నూతన ఆవిష్కరణలే దేశ ప్రగతికి కీలకంగా మారాయన్నారు. విద్యార్థులకు కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

ఎన్‌పిటిఇఎల్ ఫలితాల్లో వివిఐటి అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

సాంకేతిక విద్య పురోభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహించే నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ టెక్నాలజి ఎన్‌హాన్స్‌మెంట్ లెర్నింగ్ (ఎన్‌పిటిఇఎల్)లో పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సత్తాచాటారని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. అధునాతన పద్ధతులను విద్యార్థులకు, అధ్యాపకులకు పరిచయం చేస్తున్న, దేశ ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటి, ఐఐఎస్‌టి వంటి సంస్థల్లో నిష్ణాతులైన అధ్యాపకుల ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణిచ్చి, తదనంతరం నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ చూపిన 61 మంది దేశంలోనే టాపర్స్ కాగా, 1592 మంది వివిఐటి విద్యార్థులు, 16 మంది అధ్యాపకులు సర్టిఫికెట్లు పొందారని విద్యాసాగర్ వెల్లడించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిలబస్‌తో పాటు, ఆధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ పొందటం ద్వారా సాంకేతికతలో మెరుగైన ఫలితాలుంటా యన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి,

జాయింట్ సెక్రటరీ ఎం.శ్రీకృష్ణ, ఎన్‌పిటిఇఎల్ సంధానకర్త డాక్టర్ కేథార్ మల్లిక్ పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవాల ముగింపు ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి : పట్టణంలో మలేరియా మాసోత్సవాల ముగింపు ర్యాలీ మలేరియా, ఫైలేరియా విభాగం సిబ్బంది మార్త గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ విద్యార్థుల సహకారంతో శనివారం నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా కేసులు జీరోకి తేవాలని, 2030 నాటికి మలేరియా రహిత సమాజం లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

ప్రజాశక్తి - తెనాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలలో రెండవ విడత ప్రవేశాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 24 లోగా దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళాశాల, జిల్లాస్థాయి శిక్షణ కేంద్రం గుంటూరులో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాల్లో అభ్యర్థులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని, అక్కడే వెరిఫికేషన్ కూడా పూర్తి చేయించుకున్న వారు మాత్రమే కౌన్సిలింగ్‌కి అర్హులని చెప్పారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వచ్చేనెల 27న, ప్రైవేట్ ఐటిఐ కళాశాలలో 28న కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. తెనాలిలో 150 సీట్లు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణత కాని వారు కూడా వెల్డర్ ట్రేడ్లో చేరవచ్చు అని చెప్పారు. వివరాలకు 93477 95839, 6304572793 నంబర్లలో కళాశాల పని వేళల్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రంగరాజు తదితరులు

హిందూ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో వికుర్యా వెల్‌నెస్ క్లినిక్ చెన్నై వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కన్సల్టెంట్ డాక్టర్ (స్కిన్ కేర్ అండ్ వెయిట్‌లాస్ క్లినిక్) పోస్టులకు శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 9 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. తమ కళాశాల నుంచి 15 మంది ఫార్మ.డి విద్యార్థులు హాజరవగా వారిలో 9 మందిని ఎంపికయ్యారన్నారు. కార్యక్రమానికి వికుర్య వెల్‌నెస్ క్లినిక్, చెన్నై హెచ్.ఆర్.డి. ప్రతినిధులు ఉషా నందిని పర్యవేక్షణలో శ్వేత, శక్తి పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన 9 మందికి 10 రోజుల్లో జాబ్ ఆఫర్ పంపిస్తామని, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ ఉషానందిని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు కన్సల్టెంట్ డాక్టర్‌గా నెలకు రూ.25 వేలు వేతనం, ఇన్సెంటివ్స్ ఇస్తామన్నారు. ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్, ఫార్మా డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

వారెళ్లిన ప్రతిచోటా అభివృద్ధే

ప్రజాశక్తి - చేబ్రోలు

గోలి వరదరాజులు, తుంగల జయప్రకాష్‌రావు సేవలు చిరస్మరణీయమని, వారు పనిచేసిన ప్రతి చోటా ఉత్తమ సేవలు అందించి ఆ ఊళ్లను ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దారని పంచాయతీరాజ్ ఇఇ రమేష్ అన్నారు. పంచాయతీ రాజ్ ఎసి గోలి వరదరాజులు, శలపాడు పంచాయతీ కార్యదర్శి తుంగల జయప్రకాష్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సత్కరించారు. పిఆర్ ఇఇ రమేష్ మాట్లాడుతూ 20 ఏటే ఉద్యోగంలో చేరిన వరదరాజులు 42 ఏళ్లపాటు సేవలందించారని చెప్పారు. ఎంపిపి కె.సాహితీ కిరణ్ మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బాబురావు, కారంచేడు ఎంపిడిఒ కె.జ్యోతి, ఇఒపిఆర్‌డి జి.శ్రీనివాసరావు, వివిధ శాఖలు, వివిధ మండలాల అధికారులు జెబి సురేష్, టి.శ్రీనివాసరావు, ఎవిహెచ్ ప్రసాద్, ఆర్.సుబ్బారావు, ప్రకాష్‌రెడ్డి, సాయికిషోర్, పాల్, అజయ్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య
పక్షం రోజుల తరువాత కుళ్లిన మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని సాయికృష్ణనగర్ వద్ద గల 52వ సచివాలయం భవనంలోని పై అంతస్తులో ఒక ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్య చేసుకుని దాదాపు పక్షం రోజులు దాటడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్గంధభరితంగా మారింది. చుట్టుపక్కల వారి ఫిర్యాదు మేరకు గది తలుపులు తెరిచి చూడగా మృత దేహం కుళ్లిపోయి కన్పించింది. జోయల్ శాంసన్ (43) 53 సచి వాల యంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. ఆరునెలల క్రితం అతని తల్లి చనిపోయింది. తల్లిదండ్రులు లేకపోవడంతో మానసిక వ్యధకు గురైన అతను అద్దెకు వుంటున్న గదిలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండ వచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఉద్యోగానికి 20 రోజులుగా రావడంలేదని ఫోన్ స్విఛాఫ్ వల్ల తగిన సమాచారం ఇవ్వలేకపోయామని సహచర ఉద్యోగులు చెబుతున్నారు. ఆత్మ హత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ దేవప్రభాకర్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జునసాగర్ పోలీసు స్టేషన్ పరిదిలో కృష్ణానది పై గల కొత్త బ్రిడ్జ్ ఎపి వైపు నుండి 4 వ పిల్లర్ ప్రక్కన తక్కువ నీరు కలిగిన నీటి గుంటలో ఒక గుర్తుతెలియని మృతదేహం పడి ఉంది. సుమారు 65-70 ఏళ్ల వయసు కలిగిన పురుషుడి మృత దేహం. రెండు కాళ్ళు విరిగిపోయి ఉన్నాయి. మృతుడి శరీరంపై ముదురు ఆకుపచ్చ చారలు గల లేత ఆకు పచ్చ రంగు టి షర్టు, నీలి,కాఫీ రంగు గళ్ళు కలిగిన లుంగీ, కాఫీ రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. మెడకు తెల్లని కట్టు కట్టి ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు నాగర్జునసాగర్ ఎస్ఐ 9440900884, నాగర్జునసాగర్ పోలీస్ స్టేషన్-08642 278219, మాచర్ల రూరల్ సిఐ -9440796229 నంబర్లలో సంప్రదించాల్సిందిగా పోలీసులు తెలిపారు.

పాత పల్నాడు బస్టాండ్‌ను పునరుద్ధరించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ నడి బొడ్డున పల్నాడు రోడ్డులోని పాత పల్నాడు బస్టాండ్ ను పునరుద్దరించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండ్ ప్రాంగణాన్ని సిపిఐ నాయకులు సందర్శించారు.బస్టాండ్ ను పునరుద్ధరించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బస్టాండ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇప్పటికే ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళామన్నారు.

గుంటూరు రేంజ్ ఐజీని కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కషి చేయాలని గుంటూరు రేంజి ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు.ఈ మేరకు ఐజిని శనివారం మర్యాద పూర్వకంగా వారి కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్చం అందజేసి, దుశ్శాలువతో సత్కరించారు.రాష్ట్రంలో అత్యంత సమశ్యాత్మక ప్రాంతాలలో పల్నాడు జిల్లా అగ్రస్థానంలో ఉండడం బాధాకరమన్నారు. జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ కషి చేయాలన్నారు. గతంలో ప్రశ్నిస్తే కేసు, నిలదీస్తే దాడి, ఎదురిస్తే హత్య అనే పరిస్థితి నెల కొందన్నారు. నియెజకవ ర్గంలో ఇక పై శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించొద్దని విన్నవించారు. ప్రజా సమస్యలు పరిష్కారం వారి సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా పని చేయాలని సూచించారు.

నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి: ఐద్వా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కారంపూడి మండలం ఒప్పిచర్ల లో బడ్డీ బొంకు నడుపుకుంటున్న విజయలక్ష్మి అనే మహిళను దారుణంగా అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక పుతుంబాక భవన్లో జరిగిన సత్తెనపల్లి పట్టణ కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి మునగా జ్యోతి అధ్యక్షత వహించారు. ఉమాశ్రీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మతురాలి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిందితులను విచారణ పేరుతో జాప్యం చేయకుండా వెంటనే అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని, తుమ్మల లక్ష్మి, మరియమ్మ, స్పందన,షేక్ ఆయేషా, ఇంజన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎటిఎం కార్డు దొంగిలించి నగదు చోరీ

ప్రజాశక్తి - యడ్లపాడు

ఎటిఎం కార్డు దొంగిలించి నగదు తీసుకున్న ఘటన యడ్లపాడులో జరిగింది. ఎస్టీ కాలనీలో నివాసముంటున్న కారుచోల సత్యనారాయణ ఈ నెల 27వ తేదీ ఉదయం 9:30 గంటలకు స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద ఉన్న ఎటిఎంలో రూ.15,000 డబ్బులు తీసుకున్నాడు. అదే సమయంలో ఎటిఎం సెంటర్ లోపలికి వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి.. ఆయన సలహాలు ఇస్తూ.. పిన్ గుర్తు పెట్టుకున్నాడు. డబ్బులు డ్రా చేసిన తర్వాత సత్యనారాయణ డబ్బులు లెక్క పెట్టుకుంటుండగా వెనుక ఉన్న వ్యక్తి ఆయన ఎటిఎం కార్డు తీసుకొని అతని వద్ద ఉన్న మరో ఎటిఎం కార్డును ఆయన చేతికి ఇచ్చాడు. సత్యనారా యణ డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్లిన అరగంటకు ఆ ఎటిఎం కార్డును తీసుకున్న వ్యక్తి రూ.15,000, రెండోరోజు ఈ నెల 28వ తేదీన పసుమర్రులోని ఎటిఎంలో రూ.25,000 సత్యనారాయణ అకౌంటు నుంచి డ్రా చేశాడు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5:00 గం టలకు ఎకౌంటు బ్లాక్ చేసినట్లు సత్యనారాయణ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మాజీ మంత్రి విడదల రజిని, మరిది, పిఏలపై క్రషర్ అసోసియేషన్ ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాజీ మంత్రి విడదల రజిని, ఆమె మరిది గోపి, పి.ఏ రామకష్ణ ల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ మేరకు యడ్లపాడు స్టోన్ క్రషర్ వ్యాపారులు శనివారం నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2020 లో యడ్లపాడు స్టోన్ క్రషర్ వ్యాపారులను అప్పటి మంత్రి విడదల రజిని వ్యాపారం చేసుకోవాలంటే రూ.5 కోట్లు ఆమె సూచన మేరకు ఆమె అనుచరులు బెదిరింపులకు పాల్పడ్డారని, చెప్పింది వినకపోతే అధికారాన్ని అధికారులను అడ్డం పెట్టుకొని లంచం ఇవ్వకపోతే ఇబ్బందులకు గురి చేస్తామని బహిరంగంగా బెదిరించారని పల్నాడు అదనపు ఎస్పి లక్ష్మీపతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.కరోనా సమయంలో వాటిల్లిన నష్టాలు నుండి కోలుకోలేదని అన్ని అనుమతులు ఉన్నప్పటికీ వారి వేధింపులు తాళలేక వ్యాపారాలు నిలిపివేయలేక 2021లో రూ.2 కోట్లకు ఒప్పందం చేసుకున్నామని ఆమె మరిది గోపి, విజిలెన్స్ ఎస్పీ జాషువాలకు చెరో రూ.10 లక్షలు డిమాండ్ చేయడంతో గత్యంతరం లేక ఇచ్చామని ఫిర్యాదులో పేర్కొన్నారు. పిఏ రామకష్ణ అక్రమ వసూళ్లకు అప్పటి విజిలెన్స్ ఎస్పి జాషువా పూర్తి స్థాయిలో సహకరించారన్నారు. రజిని మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పంచాయతీలు చేసి కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు పిఏ రామకష్ణ పాల్పడ్డారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మాజీ మంత్రి రజిని బాధితులు ఒక్కొక్కరు బయటకు రావడం చూస్తే ఆమె అవినీతి అక్రమాలు ఇంకా ఎన్ని ఉన్నాయో అని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది.వ్యాపారుల ఫిర్యాదుపై విచారించి న్యాయం చేస్తామని బాధితులకు అదనపు ఎస్పి లక్ష్మీపతి హామీ ఇచ్చారు.

లోక్ ఆదాలత్‌లో 54 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-మాచర్ల: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో 54 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి శ్రీని వాస్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ప్రకటనను విడుదల చేశారు. లోక్ ఆదాలత్‌లో ఐపిసి క్రిమినల్ కేసులు 38, సివిల్ కేసులు 8, టెలిఫోన్ కేసులు 8 పరి ష్కార మైనట్లు తెలిపారు. పరిష్కరించబడిన కేసుల విలువ రూ 1,26, 85,540 గా ఉందని న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ వివరించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 122 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్: లోక్ అదాలత్ లో ఇచ్చే అవార్డు అంతిమ తీర్పు.అని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) మరియు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ , చైర్మన్ సిహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు అన్నారు. సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో లోక్అదాలత్ లో కేసులు పరిష్కరించారు.

ఉచిత న్యాయ సలహా సహాయ వేదిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: నరసరావుపేట మండలంలోని మేదరమట్ల అంజమ్మ మస్తానరావు లా'కళాశాల ఆధ్వర్యంలో నరసరావుపేట బార్ అసోసియేషన్ సహకారంతో సామాన్యుల కోసం చట్టవిజ్ఞానం, హిందూ వారసత్వ హక్కు చట్టం 1956, 2005 అను అంశాలపై ఉచిత న్యాయ సలహా సహాయ వేదిక సమావేశం నాదెండ్ల మండలం కనపర్రు గ్రామ పంచాయతీ శివారు గ్రామం మైనంపాడులో నిర్వ హించామని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు.

ఆర్మీ క్యాంటీన్ కార్డు పోయినది

పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఉప్పలపాడు కు చెందిన గాజుల కనకదుర్గ లక్ష్మి భర్త శ్రీనివాసరావుకు చెందిన ఆర్మీ క్యాంటీన్ కార్డు పోయినది. GA02021059594100C03 నెంబరు గల ఆర్మీ క్యాంటీన్ కార్డు రాజుపాలెం నుండి ఉప్పలపాడు వెళుతుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయ గలరు. స్వయంగా తెచ్చిఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
గాజుల కనకదుర్గ లక్ష్మి భర్త శ్రీనివాసరావు,
ఉప్పలపాడు గ్రామం, రాజుపాలెం మండలం,
పల్నాడు జిల్లా. సెల్ నెం 9347646880

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా,తాడికొండ మండలం,మోతడక గ్రామ కాపురస్తుడు పఠాన్ బాజిత్ ఖాన్ గారి కుమారుడు పఠాన్ మహబూబ్ సుభాని కు చెందిన క్రింది విరములతో కూడిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి.తేది 25-06-2024 న నేను మోతడక నుండి తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు పని నిమ్మితము వచ్చి తిరిగి వెళ్లుచుండగా ఒరిజినల్ దస్తావేజులు మార్గమధ్యలో జారి పడిపోయినవి ఎంత వెతికినను దొరకలేదు. అమరావతి రిజిస్టార్ ఆఫీసులో 1వ పుస్తకము ద.నెం.233/1981రు యున్న, అమరావతి రిజిస్ట్రార్ ఆఫీసులో ద.నెం. 278/1991 రుగా, రిజిస్టర్ కాబడిన మోతడక గ్రామం తాలూకు ద.నెం.99ఎ -4ఎ3బి2రు,య 2-00 శెంట్ల భూమికి సంబంధించినటువంటి ఒరిజినల్ విక్రయ దస్తావేజులు పోయినవి .దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు గాని, ఫోన్ నెంబరుకు గాని తెలియపరచవలసినదిగా కోరుతున్నాను.

ఇట్లు
పఠాన్ మహబూబ్ సుభాని S/o పఠాన్ బాజిత్ ఖాన్
మోతడక గ్రామం, తాడికొండ మండలం
గుంటూరు జిల్లా. ఫోన్ :9948240540

బహిరంగ ప్రకటన

గుంటూరు సిటీ, ఎస్.వి.ఎన్. కాలనీ కాపురస్తురాలైన మద్దు మహాలక్ష్మీ పద్మావతి భర్త : వెంకట శంకరరావు గారి సంజాయిషీ పొంది తెలియజేయునది. పైన తెలిపిన నా క్లయింట్ తన పేరిట గల 05-12-2000 డోర్ నెం. 3198/2001గా గల ఆస్తికి శిరిగివీడి అప్పలస్వామి గారి కుమారులు 1) రాంబాబు 2) రామమోహనరావు మరియు కూరెళ్ళ వరలక్ష్మి, భర్త : వెంకటేశ్వరరావు గార్ల వద్ద తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరురవు పంచాయతీ వార్డు పాలచర్ల గ్రామం తాలూకు 201.66 చ॥ గ॥ స్థలమును క్రయం పొంది వున్న దస్తావేజును నా క్లయింటు ఎస్‌విఎన్ కాలనీ, మెయిన్‌రోడ్డులో జిరాక్స్ తీసుకొనుటకు వచ్చిన సమయంలో పోయినది. కావున పైన తెలిపిన దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ దిగువ చిరునామాకు తెలియపరచవచ్చును.

ఇట్లు
మద్దు మహాలక్ష్మీ పద్మావతి,
భర్త : వెంకట శంకరరావు,
డోర్ నెం. డి-3, ఎస్‌విఎన్ కాలనీ, గుజ్జనగుండ్ల,
గుంటూరు - 522006. సెల్ : 9397603076

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No.18/2019

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానము,
శింగరకొండ, అద్దంకి మండలం, రి.బై.
కార్యనిర్వహణాధికారి ...... వాది
V/S
వాసంశెట్టి చంద్రరావు .... ప్రతివాది

ప్రకటన

To: ప్రతివాది
వాసంశెట్టి చంద్రరావు S/o పల్లయ్య,
ఫోటో గ్రాఫర్, కొటప్పకొండ, నర్సరావుపేట
మండలము, గుంటూరు జిల్లా (Old),
పల్నాడు జిల్లా (New).

పై నంబరు దావా లో మీకు ఎన్నిసార్లు దావా సమనులు/ నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై దావా లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది : 26-07-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగా గాని, వకీలు ద్వారాగాని హాజరయి పై దావా లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి, B.Sc.,BL.,
వాది తరుపు న్యాయవాది

మహారాజశ్రీ గురజాల సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టువారి దివ్య సముఖమునకు
ఐ.పి. నెం. 14/2024

బిట్వీన్ :
షేక్ మదార్ సాహెబ్ .... పిటీషనర్
అండ్
1) లేళ్ళ నాగేశ్వరరావు,
2) చీకటి శివ @ చికెన్‌కొట్టు శివ
3) జూలకంటి మణికంఠారెడ్డి
4) కర్రావుల సైదులు
5) శెట్టి హైమావతి
6) షేక్ అక్బర్ .... రెస్పాండెంట్స్

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనరు దాఖలు చేసియున్నాడు. సదరు పిటీషన్‌కు సంబంధించిన నోటీసులు ఆర్డరు వేసియున్నారు. సదరు వాయిదా తేది 2-7-2024 అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు
షేక్ జానీ బాషా
పిటీషనరు తరఫున న్యాయవాది,
గురజాల. సెల్ : 94402 41795

మహారాజశ్రీ గురజాల సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టువారి దివ్య సముఖమునకు
ఐ.పి. నెం. 13/2024

బిట్వీన్ :
షేక్ నాగుల్ మీరా .... పిటీషనర్
అండ్
1) యలగాల హనుమంతరావు
2) మేకల రవీంద్రారెడ్డి
3) భువనం క్రిష్ణారెడ్డి
4) మద్దికుంట నాగేశ్వరరావు
5) షేక్ జాన్‌వలి
6) షేక్ రజియా
7) షేక్ అలీ
8) షేక్ హుస్సేన్
9) షేక్ మౌలాలి
10) షేక్ రహంతుల్లా .... రెస్పాండెంట్స్

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనరు దాఖలు చేసియున్నాడు. సదరు పిటీషన్‌కు సంబంధించిన నోటీసులు ఆర్డరు వేసియున్నారు. సదరు వాయిదా తేది 2-7-2024 అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీకు పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు
షేక్ జానీ బాషా
పిటీషనరు తరఫున న్యాయవాది,
గురజాల. సెల్ : 94402 41795

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

సిఎస్‌కు వివరాలు తెలిపిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ చెప్పారు. జులై1 వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పం పిణీ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాట్లను సిఎస్ కు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జులై 1 న ఉదయం 6 గంటల నుండే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలో అర్హులైన అందరికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సచివాలయాల్లో సచివాలయ ప్రభుత్వ శాఖల ఉద్యోగులను పింఛన్ల పంపిణీ కోసం సేవలను వినియోగించనున్నట్లు తెలిపారు. పెన్షన్ల పంపిణీకి గ్రామ/వార్డ్ సచివాలయ సిబ్బంది సేవలను, అదనపు సిబ్బందిగా వివిధ శాఖల లోని జూనియర్ అసిస్టెంట్, తదితర సిబ్బంది సేవలు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబందించిన యంత్ర పరికరాలను సిబ్బందికి అందజేశామని, అదనపు సిబ్బందికి బయోమెట్రిక్ యంత్ర పరికరం వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గిరిజన మండలాల్లో పెన్షన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పెంపు ఇలా..

జులైలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రాలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఇవ్వనున్నారు. జులై ఒకటిన ఏప్రిల్, మే, జూన్ నెలలది కలిపి రూ.7 వేలు పంపిణీ చేయనున్నారు. వికలాంగులకు అందించే సాయాన్ని రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. వీరికి జులై 1న రూ.15 వేలు అందించనున్నారు. కిడ్నీ, కాలేయం. గుండె మార్పిడి చేసుకున్నవారికి రూ. 5 వేలు నుంచి రూ.10 వేలు ఇవ్వనున్నారు. మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలు ఇవ్వనున్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రూ.161 కోట్లతో శాశ్వత తాగునీటి పథకం పూర్తి చేస్తాం
- 146 జీవో ప్రకారం ఎన్ఎస్పి స్థలంలో అభివృద్ధి పనులు
- ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి
- వినుకొండ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణాన్ని అభివద్ధి పదంలో నడిపించి రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దరమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే జిబి ఆంజనేయులు అన్నారు. వినుకొండ మునిసిపల్ కౌన్సిల్ హాల్లో చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు అందరూ పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో 29 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నాడు టిడిపి హయంలో 161 కోట్ల నిధులను ప్రభుత్వం నుండి తీసుకురావడం జరిగింది అన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తాగునీటి పథకానికి 30 శాతం వాటా చెల్లించకపోవడం వలన తాగునీటి పథకాలు ఆచరణకు నోచుకోక ప్రజలు నేటికీ ఇబ్బంది పడుతున్నారన్నారు. తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా త్రాగునీటి సమస్యను పరిష్కరించి శుద్ధమైన తాగునీటిని అందిస్తామని అన్నారు. పట్టణంలో కోట్లు విలువచేసే ఎన్ ఎస్ పి స్థలాన్ని నాడు తాము మునిసిపాలిటీ అభివృద్ధికి 22 ఎకరాలు అప్పగించడం జరిగిందని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి చేయకుండా అసత్య వాగ్దానాలతో ప్రజలను మోసం చేశారన్నారు. వినుకొండ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఎన్ఎస్పి స్థలంలో అభివద్ధి చేపట్టేందుకు నాడు టిడిపి ప్రభుత్వంలో తీసుకువచ్చిన 146 జీవో ప్రకారం, టీటీడీ కళ్యాణమండపం, స్టేడియం, లైబ్రరీ, షాపింగ్ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధిలో అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వినుకొండ పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించుటలో మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వైసిపి పాలనలో వార్డుల్లో జరగవలసిన అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులను కొందరు స్వార్థపరులు వారి సొంత ఆస్తుల వద్ద ఉపయోగించారని, ప్రజా ధనం దుర్వినియోగం జరిగితే సహించేది లేదన్నారు. పట్టణంలో అంతర్గత డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. డంపింగ్ యార్డ్ నిమిత్తం మన చోట్ల స్థలాలు చూస్తే పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుందామని తెలిపారు. కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకువచ్చిన, విద్యుత్తు నో వోల్టేజీ, డ్రైనేజీ, త్రాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

టిడ్కో గృహాల్లో సరైన వసతుల్లేవు

కౌన్సిల్ సమావేశం వాడీవేడి చర్చ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రెవిన్యూ షరాఫ్ శాఖలో అవినీతి తాండవం చేస్తోందని, లక్షల కొద్దీ డబ్బు మాయ మౌతోందని, ఈ విషయమై సక్రమంగా సమాధానం లేదని, మూడేళ్ళు అయినా కనీసం తమ పేర్లతో ఉన్న శిలా ఫలకాన్ని కూడా ఏర్పాటు చేయలేదని, ఎప్పుడు ఏర్పాటు చేస్తారో ఇప్పటికైనా చెప్పాలని ఫ్లోర్ లీడర్, ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీగా వేడిగా జరిగింది. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్మ న్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కౌన్సిలర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ 52 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో నివాస గృహాల్లో నివాసముంటున్న పేద ప్రజలకు సరైన వసతులు లేవని ఎప్పుడు కల్పిస్తారని ప్రశ్నించారు. పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని, సిసి కెమెరాల సంఖ్య పెంచాలని కోరారు.

గతంలో గంగా భవాని అనే ఔట్సోర్సింగ్ ఉద్యోగి అవినీతికి పాల్పడి సుమారు లక్షల రూపాయల డబ్బులను మాయం చేసినట్లు కమిషనర్ స్వయంగా చెప్పారని, వాటిని రికవరీ ఏమైందని ప్రశ్నించారు. ఆమెపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని అన్నారు. అసలు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు షరాఫ్ శాఖలో ఏం పని అని టిడిపి పదో వార్డు కౌన్సి లర్ బేరింగ్ మౌలాలి ప్రశ్నించారు. కమిషనర్ సిహెచ్ గోవిందరావు సమాధానమిస్తూ ఆమెపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నారని, డబ్బు రికవరీ చేసే ప్రయత్నంలో ఉన్నామన్నారు. ఆమెను సస్పెండ్ చేశామన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిస్థితి దీనంగా ఉందని సుమారు తొమ్మిది కోట్లకు పైగా బకాయిలు ఉండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని అన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించాలని టిడిపి సభ్యులు కోరారు. టిపిఎస్ చదివిన సిబ్బంది లేనందున వారిని తొలగించలేకపోతున్నట్లు కమిషనర్ తెలిపారు.

టిడిపి 21వ వార్డు మహిళా కౌన్సిలర్ లక్ష్మీ తిరుమల మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న గౌడ కళ్యాణమండపం ఎదురుగా అక్రమ కట్టడాలు కడుతున్నారని ఈ విషయమై ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని , ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయం గురించి అడిగిన ప్రతిసారి డిపిఒ లేదంటున్నారంటూ కమిషనర్‌పై మండిపడ్డారు. మురుగు కాలవలు బాగు చేయని కారణంగా డ్రెయిన్లు పొంగుతున్నాయని, దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి కనుక నివారణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమస్యల గురించి ప్రస్తావించినప్పుడల్లా ఏవో కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. చైర్మన్ ఎస్‌కె రఫాని సమాధానమిస్తు త్వరలోనే అక్రమ కట్టడాల విషయమై చర్యలు తీసుకుంటామన్నారు. గణపవరానికి చెందిన వైసిపి వైస్ చైర్మన్ కొల్లేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణం నుంచి వచ్చే మురుగునీరు గణపురం వెళ్లే దారిని ముంచెత్తుతోందని అన్నారు. అజెండాలోని 54 అంశాలను ఆమోదించారు. అజెండా చదవడం పూర్తయిన అనంతరం సభకు అధ్యక్ష ఉంచిన మున్సిపల్ చైర్పర్సన్ షేక్ రఫాన్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రతి కౌన్సిలర్ సభ్యులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలన్నారు ముందుగా నూతనంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సిఎం చంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున మున్సిపల్ చైర్మన్ ఎస్‌కె రఫానీ, సమస్యల గురించి ప్రస్తావిస్తున్న టిడిపి కౌన్సిలర్ లక్ష్మీ తిరుమల

ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

సబ్‌జైలులో న్యాయమూర్తుల తనిఖీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి సబ్ జైలు ను న్యాయమూర్తులు శనివారం తనిఖీ చేశారు. సత్తెనపల్లి సీనియర్ జడ్జి (సీనియర్ డివిజన్) సిహెచ్. నాగ వెంకట శ్రీనివాసరావు సత్తెనపల్లి రెండోవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహ్మద్ గౌస్ లు సబ్ జైలు ను సందర్శించిన ఖైదీల బారక్ లను బాత్ రూములో పరిశీలించారు. వంటకాలను తనిఖీ చేసి భోజనాన్ని రుచి చూశారు. ఖైదీల బోజనానికి వినియోగించే సరుకులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూపరింటెండెంట్‌ను న్యాయ మూర్తులు ఆదేశించారు. న్యాయవాది బిఎల్ కోటేశ్వరరావు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

జెన్కో ఈఈ వైఎస్ఆర్కే ప్రసాద్

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని ఏపీ జెన్కో ఈ ఈ వైఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రం లో ప్లాంట్ అసిస్టెంట్ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బత్తిన అప్పలనర్సమ్మ సన్మాన కార్యక్రమం లో శనివారం ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ ఈ ప్రసాద్ మాట్లాడుతూ అప్పలనర్సమ్మ విధి నిర్వహణలో నిబద్ధత తో పనిచేయడం ఆనందనీయం అన్నారు. అనంతరం ఉద్యోగులు అప్పలనర్సమ్మ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డి ఈ రాజారెడ్డి,ఐఎన్టియూసి 327 యూనియన్ రీజినల్ ప్రెసిడెంట్ సాంబశివ,రీజినల్ సెక్రెటరీ సూరజ్ చంద్ పాల్గొన్నారు.

చెత్తను తరలించేందుకు పాఠశాలకు రిక్షా

ప్రజాశక్తి-పెదకూరపాడు: మండలంలోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు పరిశుభ్రత కోసం రిక్షాను దాతలు అందించారు. శనివారం ఆ పాఠశాలలో దాతలు మైత్రి బ్రదర్స్ జొన్నల శ్రీరామ్ పాపిరెడ్డి, గుత్తికొండ శివసుందర్ రెడ్డిల తరపున వారి సోద రుడు శివనాగిరెడ్డి పాఠశాలకు అందజేశారు. స్వచ్ఛ పాఠశాల నిర్వహణలో తడి చెత్త, పొడిచెత్త, వేస్ట్ మెటీరియల్ డంపింగ్ యార్డుకు చేర్చడానికి ఇబ్బందిగా ఉండటంతో పాఠశాల అభి వృద్ధి కమిటీ అభ్యర్థన మేరకు వారు స్పందించి స్వచ్ఛ భారత్ రిక్షాను తయారు చేయించి అందజేశారు. దాతలకు ప్రధానో పాధ్యాయులు ఎ.శ్రీనివాసరెడ్డి,పీసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, అభివద్ధి కమిటి సభ్యులు జి.గురవారెడ్డి, సిహెచ్ రవి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వం మారితే మీ తీరు మారుతుందా?

- అబద్ధాలు చెప్పొద్దు.. నాకేమీ సమాచారం ఇవ్వలేదు..
- కౌన్సిల్‌లో కమిషనర్, అధికారులపై చైర్‌పర్సన్, కౌన్సిలర్ల ఆగ్రహం
- పరస్పర వాగ్వాదాలతో అజెండా ప్రస్తావన లేకుండానే ముగింపు
- నిరసనగా పోడియం వద్ద టిడిపి బైటాయింపు
- కాకినాడ పర్యటన నేపథ్యంలో హాజరవ్వని మంత్రి మనోహర్

కమిషనర్‌తో కౌన్సిలర్ రామయ్య వాగ్వాదం

అధ్యక్ష స్థానంలో చైర్‌పర్సన్ రాధిక, పోడియం ముందు బైటాయించిన టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-తెనాలి

కౌన్సిలర్లు, అధికారులు పరస్పర వాగ్వివాదంతో అజెండా అంశాలను ప్రస్తావించకుండానే కౌన్సిల్ సమావేశం ముగిసింది. అధికారం మారితే అధికారులు తీరుకూడా మారుతుందా? అంటూ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ కూడా కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ టి.రాధిక అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది.

మొత్తం 27 అంశాలతో కూడిన అజెండాలో తొలి అంశం చదవటం పూర్తికాగానే వైసిపి కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య లేచి ప్రభుత్వం మారగానే అధికారులు తీరు మారటం సరికాదని, వార్డు పర్యటన, వార్డుల్లో జరిగే పనులపై కౌన్సిలర్లకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని, దీనికి కమిషనర్ సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. కమిషనర్ బి.శేషన్న స్పందిస్తూ పారిశుధ్యానికి సంబంధించి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పనులు నిర్వహించామని, ఈ విషయం చైర్‌పర్సన్‌కు చెప్పామని అన్నారు. చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని తనకు అధికారుల నుంచి సమాచారం లేదని, అబద్దాలు చెప్పొద్దంటూ కమిషనర్‌ను వారించారు. దీనిపై కమిషనర్ కూడా ఘాటుగానే స్పందించారు. పట్టణంలో పారిశుధ్యం, వీధిదీపాలు, వాటర్ పైప్‌లైన్ వంటి అత్యవసరమైన అంశాలను పరిశీలించే క్రమంలో సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని, అది తన విధినిర్వహణలో భాగమని చెప్పారు.

టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి మాట్లాడుతూ రణరంగ చౌక్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద అభివృద్ధి పనులకు మున్సిపల్ నిధులను ఎలా ఉపయోగిస్తారని, విగ్రహం ఏర్పాటుకు అనుమతులున్నాయా? అని ప్రశ్నించారు. దీనిపై వైసిపి కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి జోక్యం చేసుకుని 2010లో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న ప్రస్తుతం మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్ వైఎస్సార్ విగ్రహానికి స్థలం కేటాయించారని, కొండవీటి సేవాసమితి స్వతహాగా విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని బదులిచ్చారు. విగ్రహం ఉన్న ప్రాంతంలో మంచి వాతావరణం కల్పించేందుకు పురపాలక సంఘ నిధులను వెచ్చించినట్లు చెప్పారు. విగ్రహ అనుమతుల విషయంపై తదుపరి సమావేశంలో స్పష్టతనిస్తామని కమిషనర్ చెప్పారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి దాదాపు రూ.కోటి రూపాయలు వెచ్చించారని, పురపాలక సంఘ నిధులను గ్రామీణాభివృద్ధికి ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించారు. అదేసమయంలో వైసిపి కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య అజెండా అంశాలను ఆమోదిస్తున్నట్లు అర్ధాంతరంగా ప్రకటించటంతో అజెండా అంశాలు చర్చకు రాకుండా సభ పక్కదారి పడుతుందని, ఈ సమావేశం ముగిసిందంటూ చైర్‌పర్సన్ చాంబర్ నుంచి వెళ్లిపోయారు. ఆమెతో పాటే వైసిపి కౌన్సిలర్లు, అధికారులు కూడా కౌన్సిల్ హాలు నుంచి నిష్క్రమించారు. దీంతో టిడిపి కౌన్సిలర్లు పోడియం వద్ద చేరి వైసిపి డౌన్ డౌన్.. చైర్‌పర్సన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

హాజర్వని ఎక్స్‌అఫీషియో సభ్యులు మనోహర్

వాస్తవానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరవుతారని, సమావేశం వాడీవేడిగా జరగుతుందని అంతా భావించారు. మున్సిపల్ నిధులు రూ.కోట్లలో దుర్వినియోగమయ్యాయని ఇటీవల పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పైగా అజెండాలో రాటిఫికేషన్‌కు పెద్ద మొత్తంలో ప్రస్తావించటంతో మంత్రి కచ్చితంగా హాజరవుతారని అంతా భావించారు. అయితే మనోహర్ కాకినాడ పర్యటనలో ఉండటంతో సమావేశానికి రాలేకపోయారు.

చైర్‌పర్సన్ తీరుపై టిడిపి తీవ్ర అభ్యంతరం

అజెండా అంశాలను ప్రస్తావించకుండా ఆమోదించామని చెప్పి సమావేశం నుంచి చైర్‌పర్సన్ నిష్క్రమించటాన్ని టిడిపి కౌన్సిలర్లు తప్పుపట్టారు. చైర్‌పర్సన్ పోడియం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. టిడిపి కౌన్సిలర్ త్రిమూర్తి మాట్లాడుతూ అడ్డగోలుగా చేపట్టిన పనుల రాటిఫికేషన్‌కు అడ్డుతగులుతామన్న భావనతోనే సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి చైర్‌పర్సన్ నిష్క్రమించారని అరోపించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, ఇన్‌చార్జి ఎంఇ శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు, టిడిపి, వైసిపి కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. పోడియం ముందు బైఠాయించిన వారిలో పి.త్రిమూర్తి, డి.యుగంధర్, ఎ.వెంకటేశ్వరరావు, బి.అరుణ, అన్నం పిన్నారావు, దివి అనిత, కె.లక్ష్మి, టి.శిరీష ఉన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువత, విద్యార్థులకు చేబ్రోలులోని స్కిల్‌హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును ప్రారంభస్తున్నట్లు గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు యువతకు నైపుణ్య శిక్షణ కల్పించి, వారిని స్థానికంగా జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ స్కిల్‌హబ్ శిక్షణల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, జిల్లాలోని ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈ కోర్సు కోసం ఇంటర్, ఆపైన విద్యార్హత కలిగిన వారు జులై 3వ తేదీలోపు స్కిల్‌హబ్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం 9666545975 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నేడు ఉదయం 9.30 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, కళ్లకు సంబంధించి అన్ని పరీక్షలు చేసి, వివరాలు ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కంటి శుక్లాలు, నీటి కాసులు, రెటీనాపై శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యోగిత, డాక్టర్ బిపిన్‌లు పాల్గొని అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఘనంగా హెచ్‌ఎం విజయలక్ష్మి ఉద్యోగ విరమణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

విజయలక్ష్మి దంపతుల్ని సత్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, తదితరులు

స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి ఉద్యోగ విరమణ సభ శనివారం పాఠశాలలో నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ, దళిత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉర్దూ డిఐ ఖాసిం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 37 ఏళ్లుగా విద్యాశాఖలో వివిధ హోదాల్లో నిబద్ధతతో పనిచేసి, అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. గత 12 ఏళ్లుగా గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎంగా పేద విద్యార్థులున్న ప్రాంతంలో పనిచేసి, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచటానికి కృషి చేశారన్నారు. ప్రభుత్వ టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ పాఠశాలకు సమయపాలన పాటిస్తూ, ఎంతో నిజాయితీగా పని చేశారని చెప్పారు. ఎపిసి విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యాశాఖలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థుల అభిమానం పొందిన ప్రధానోపాధ్యాయురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిఇఒ చంద్రమోహన్, ఎంఇఒ-2 నాగేంద్రమ్మ, డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పొన్నూరు : ఖరీఫ్ సీజన్లో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించడంతోపాటు కల్తీ విత్తనాలపై నిఘా పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జక్కా రవీంద్రనాథ్ కోరారు. రైతులు ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించిన నేపథ్యంలో ప్రభుత్వం నకిలీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వ సన్నద్ధత లోపించిన కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎన్నడూ చూడని నష్టాలు చవి చూసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆ తప్పు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, రైతులకు దన్నుగా నిలవాలని కోరారు.

లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జీలు, కక్షిదారులు

లోక్ అదాలత్‌లో 80 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం మంగళగిరి కోర్టుల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 80 కేసులు పరిష్కారమయ్యాయి. పరిష్కారమైన వాటిలో బ్యాంక్, సివిల్, క్రిమినల్ తదితర కేసులున్నాయి. సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వి.రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు, న్యాయవాదులు రాజేష్, ఎ.రామ్మోహన్‌రెడ్డి, వి.భారతీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.బాలమురళీకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో తల్లీబిడ్డను ఇంటికి పంపుతున్న వైద్యులు, సిబ్బంది

పిహెచ్‌సిలో ఒకేరోజు రెండు కాన్పులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకేరోజు రెండు కాన్పులు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇజాస్ అబ్దుల్ రహిమాన్ తెలిపారు. కంఠంరాజు కొండూరుకు చెందిన కె.నాగలక్ష్మి, మోరంపూడికి చెందిన సిహెచ్ రత్నకుమారి శుక్రవారం సాయంత్రం పురిటి నొప్పులతో ఆసుపత్రికి వచ్చారు. శుక్రవారం రాత్రి డాక్టర్, నర్సులు ధనలక్ష్మి, శాంతి, ఎఎన్‌ఎంలు లక్ష్మి, సుజాత సహకారంతో ఇద్దరికీ సాధారణ కాన్పులు చేశారు. తల్లులు, బిడ్డలు క్షేమంగా ఉండటంతో శనివారం డిశ్చార్జి చేసి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇళ్లకు పంపించినట్లు ఆయన తెలిపారు. సిజేరియన్‌తో పనిలేకుండా సాధారణ కాన్పులు చేసి సురక్షితంగా ఇళ్లకు పంపినందుకుగాను వైద్యులు, సిబ్బందికి బాలింతలు, వారి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

జాయింట్ కలెక్టర్‌కు టిడిపి నాయకుల సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం కలిసి సత్కరించారు. వి.మాధవరావు గౌడ్, జె.బాలకృష్ణ, సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జెసి రాజకుమారిని సత్కరిస్తున్న నాయకులు

డయేరియా నివారణపై రేపటి నుండిఅవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రేపటి నుండి 60 రోజుల పాటు జరిగే డయేరియా నివారణ అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు డయేరియాకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ లో డయేరియా నివారణకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రచురించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పని చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ ఏరియా ఆసుపత్రులలో జులై నెల 1 నుండి ఆగష్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 నిర్వహించాలని, ఆరోగ్య, ఆషా కార్యకర్తలు తమ పరిధిలోని గృహాలను సందర్శించి డయేరియా వ్యాధి గ్రస్తులను గుర్తించాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నట్లయితే వారికి 2 ప్యాకెట్ల ఓఆర్ఎస్ తో పాటు 14 జింక్ టాబ్లెట్లు ఇవ్వాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి గీతాంజలి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని వ్యక్తిగత పరిశుభ్రత ,రక్షిత మంచినీరు , వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకొనడం ద్వారా పల్నాడు జిల్లాలో ఏ ఒక్క బిడ్డ కూడా డయేరియాతో మరణించకుండా చూడాలన్నారు.

ఈవీఎం ల గోదామును పరిశీలించిన కలెక్టర్

పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయ గోదాములో నిల్వ చేసిన ఈవిఎం భద్రత ప్రక్రియపై ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వి.వి.ప్యాట్లలో ఉండే పేపర్ రోల్, అడ్రస్ సీల్ ను తొలగించే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-మాచర్ల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి కె.వినాయకం, నరసరావుపేట రెవిన్యూ డివిజినల్ అధికారి-నరసరావుపేట రిటర్నింగ్ అధికారి సరోజ, సత్తెనపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల జమా ఖర్చుల వివరాలు అందజేయాలి

సాధారణ ఎన్నికలు- 2024 లో పోటీ చేసిన అభ్యర్థులు వారి వారి ఎన్నికల జమా ఖర్చుల వివరాలను నిబంధనల మేరకు సంబందిన నమూనాలో అందచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ అన్నారు. శనివారం నరసరావుపేట కలెక్టరేట్ లో సాధారణ ఎన్నికలు- 2024 లో పాల్గొన అభ్యర్థులు, వారి వారి ఎజంట్లతో ఎన్నికల జమా ఖర్చుల రీ-కన్సిలేషన్ ప్రక్రియను ఎన్నికల నియోజిక వర్గాల వ్యవయ పరిశీలకులు జోసెప్,సుమీత్ కుమార్, గౌతమన్ సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 122 మంది ఎన్నికల ప్రక్రియలో పోటీ చేసారని అందులో 89 మంది అభ్యర్థుల జమ ఖర్చు వివరాలు చేపట్టడం జరుగుతుందని, మిగిలిన 33 మంది అభ్యర్థులకు సంధించి రేపు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

పోటీలో పాల్గొనని వారు తమ ఎన్నికల జామా ఖర్చులను విధిగా పూర్తి స్థాయిలో అందించిన వ్యయ పరిశీలకుల సమక్షములో పరిశీలించి వారి సంతకము, జిల్లా ఎన్నికల అధికారి సంతంకం అనంతరం ఎన్నికల కమీషన్ కు పంపడం జరుగుతుందన్నారు. ఎన్నికల జమా ఖర్చుల వివరాలు అందించని వారిని బ్లాక్ లిస్ట్‌లో ఉంచి, రానున్న రెండు ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హత పొందుతారని తెలిపారు. గెలిచిన అభ్యర్థి విధిగా త్వరిత గతిన వివరాలు అందించాలన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తదితరులు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొగ్గరం పాఠశాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఈపూరు

పూర్వ విద్యార్థుల ఐక్యతతో పాఠశాలకు సమకూరిన వసతులు విద్యార్థులు లక్ష్యాలను చేరుకునేందుకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పాఠశాలలో 60 వసంతాల వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీవి హాజరయ్యారు.ముందుగా పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన శాస్త్రవేత్తల విగ్రహాలను సందర్శించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడారు. బొగ్గరం ఓల్డ్ స్టూడెంట్స్ సం ఘం (బాస్) ను స్థాపించి కమిటీగా ఏర్పడి అంచలంచలుగా పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన అందరిని జీవి అభినం దించారు.తన ముందు ఉంచిన పాఠశాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేలా కషి చేస్తానని గ్రామస్తులకు జీవి హామీ ఇచ్చారు. విద్యా ర్థినిలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్లూరి హైమావతి ప్రధానోపాధ్యా యులు సిహెచ్ వీరప్పయ్య, బాస్ అధ్యక్షులు సుబ్బరామయ్య, కార్యదర్శి లింగా ఆంజనేయులు, సిఐలు పొట్లూరి వీర రాఘవులు, మొండితోక రోశయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అభినందన సభ

ప్రజాశక్తి-వినుకొండ

విద్యార్థులు ఉపాధ్యాయులు సమాజం రామాచారి మాస్టారుని ఆదర్శంగా తీసుకొని సామాజిక బాధ్యతను క్రమశిక్షణను అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్ బి హెచ్ అండ్ జెడ్ పి హెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. హనుమంత్ కుమార్ అన్నారు. గత 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఆదివారం నాడు పదవీ విరమణ చేయుచున్న వి సి హెచ్ రామాచారికి అభినందన సభ శనివారం పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జై హేమంత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. వి సి హెచ్ రామాచారి ఈశ్వ రమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ బ్రాహ్మణ డెవలప్మెంట్ సొసైటీ మరియు బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న బ్రాహ్మణ భవన్‌లో మాజీ ప్రధాని పివి నరసింహారావు 103 వ జయంతి సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సంస్మరణ సమావేశం ఏర్పాటు చేశారు.

7న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదకూరపాడు

జూలై నెల ఏడో తేదీన పెదకూరపాడు లో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. . స్థానిక ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాలలో ఈ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రయాణికుల అవస్థలు పట్టవా?

- ఆర్టీసీ బస్టాండ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు
- అపరిశుభ్ర వాతావరణం,అధ్వానమైన పరిస్థితుల పై ఆగ్రహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సింది పోయి ఏమాత్రం పట్టనట్టు ఉంటే ఎలాగని ఆర్టీసీ అధికారులను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రశ్నించారు. శనివారం నరసరావు పేటలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్కడి సదుపాయాలపై నిలదీశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు, బురద బస్టాండ్ ఆవరణలో నిలిచిపోవడంతో దుర్వాసన కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే నాలుగుసార్లు బస్టాండ్ పరిశీలించానని అయినా పరిస్థితులు మారక పోతే ఎలాగని అన్నారు. ఈ మేరకు బస్టాండ్ ఆవరణలోని పూడుకుపోయిన కాలువను ఎమ్మెల్యే శుభ్రం చేశారు. బస్టాండ్ స్థలాన్ని అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు లీజ్‌కు ఇచ్చి,పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని చూస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండులో కనీసం పరిశుభ్రత పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు అనుమతులను రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి ఆర్ఎం, డిఎం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వినతి

గత ప్రభుత్వ అసమర్థ,నిర్లక్ష్య పని తీరుతో గాడి తప్పిన వైద్య రంగాన్ని గాడిలో పెట్టే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు.ఈ మేరకు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అదే సమయంలో ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని,ప్రభుత్వాసుపత్రుల్లో సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అరవిందబాబు, వెంట రాష్ట్ర బులియన్ గోల్డ్ మర్చంట్ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్ ఉన్నారు.

బస్టాండ్ ఆవరణలో పూడుకుపోయిన కాలువను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే

టిడిపి నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

నియోజకవర్గంలో వైసిపి వర్గీయులు ఫ్యాక్షన్ ప్రేరేపిస్తే చూస్తూ ఊరుకునేది లేదని దాడుల సంస్కృతికి తెరలేపే వారిని ఉపేక్షించబోమని ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు. రొంపిచర్ల మండలం మునమాకలో శుక్రవారం రాత్రి శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్లిన గ్రామ టిడిపి నాయకుడు మాజీ ఎంపిటిసి కుంపటి రవిపై అదే గ్రామానికి వైసిపి వర్గీయులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లి, నిందితులను అరెస్టు చేసి చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడికి గురై అపస్మారక స్థితిలో చేరి పట్టణంలో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవిని ఎమ్మెల్యే పరామర్శించారు.

లబ్ధిదార్ల ఇళ్ల వద్దే పింఛను పంపిణీ

ప్రజాశక్తి -పెదకూరపాడు

మండలంలో 7818 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇంటింటికి తిరిగి పంపిణీ చేయనున్నట్లు పెదకూరపాడు ఎంపీడీవో మల్లేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు మండలంలో ఉన్న 14 సచివాలయాలకు ఐదు కోట్ల 36 లక్షల 20 వేల ఐదు వందల రూపాయలు ప్రభుత్వం వారు జమ చేసినట్లు వివరించారు. జూలై ఒకటో తేదీన అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

మాచర్ల నుండి శ్రీశైలానికి టిడిపి కార్యకర్తల సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల అసెంబ్లీ ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి విజయం సాధించటం, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటంతో మాచర్ల టౌన్‌కు చెందిన టిడిపి నాయకులు కంభంపాటి చంటి, గోపవరపు కేశవ, గాడిపర్తి సాయిలు శనివారం మాచర్ల నుండి శ్రీశైలంకు సైకిలు యాత్ర చేపట్టారు. పట్టణంలోని మండాది రహదారిలోని ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించిన అనంతరం యాత్రను ప్రారంభించారు. బ్రహ్మారెడ్డి గెలిస్తే తాము శ్రీశైలం సైకిల్ యాత్ర చేపడతామన్న తమ మొక్కును తీర్చుకున్నారు. వీరి యాత్రను బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. క్షేమంగా వెళ్ళి శ్రీశైల మల్లన్న దర్శనం చేసుకోని రావాలని, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

'బియ్యం బకాసురులను వదిలి పెట్టం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రంలో పేదల బియ్యం బొక్కేసి, అడ్డదారుల్లో వందలు, వేల కోట్లకు పడగలెత్తిన వైసిపి బియ్యం బకాసురులందరి బండారం త్వరలోనే బట్టబయలు కావడం ఖాయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. స్థానిక పండరీపురంలోని ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ పేదలు ఆకలి తీర్చే రేషన్ బియ్యాన్ని పక్క దారి పట్టించి, బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకున్న దొంగలు ఏ స్థాయిలో ఉన్న వారైనా ప్రజా ప్రభుత్వంలో వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కొద్దిరోజులుగా పౌరసరఫరాల శాఖకు సంబంధించి వెలుగు చూస్తున్న విస్తుపోయే వాస్తవాల నేపథ్యంలో గడిచిన అయిదేళ్లలో ప్రతి నియోజకవర్గంలో చోటుచేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలన్నీ తవ్వితీయాల్సిన సమయం వచ్చిందన్నారు. మొత్తం వెలికితీస్తే సగం మంది వైసిపి నేతలు ఊచలు లెక్క పెట్టడం ఖాయమన్నారు.

ఎమ్‌టిఎంసి పరిధిలో చెత్త పన్నును నిలిపేస్తున్నాం : కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో చెత్త పన్నును నిలిపివేసినట్లుగా మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పర్యవేక్షణలో భాగంగా మంగళగిరిలో ఎన్‌సిసి రోడ్, పెనుమాక గ్రామ సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించారు. తొలుత ఆయా వార్డుల పరిధిలోని పారిశుధ్య కార్మికుల పనితీరు, హాజరును పరిశీలించారు. చెత్త సేకరణ, నీటి సరఫరాపై కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ప్రతి వార్డులో ఐఇసి యాక్టివిటీస్ (ఫోగింగ్, క్లోరిన్ టెస్ట్‌లు) తదితర అంశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని, గ్రీనరీ, నగర సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులు, పైప్ లైన్లు, మురుగునీటి కాల్వలను పరిశీలించి, తాగునీటి సాంద్రత పరీక్షలను ఆరోగ్య, పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగపు సిబ్బందితో కలసి పరిశీలించారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలూ పాటించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిఈఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, ఫిట్టర్‌లు, ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమాకలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎమ్‌టిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్ పెనుమాకలో శనివారం పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎస్సీ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. కార్మికుల హాజరు పట్టీని పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు వార్డుల్లో సమయానికి వచ్చి చెత్త సేకరిస్తున్నారా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చెత్త పన్ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రతి వార్డులో ఫాగింగ్, క్లోరిన్ నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు గ్రీనరీ, సుందరీకరణపై దృష్టి సారిస్తామని చెప్పారు. తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురైనా, మురికి నీరు వస్తున్నా తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం తాగునీటి సాంద్రత పరీక్షలను సిబ్బందితో కలిసి పరిశీలించి కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు, కుట్టు మిషన్ల పంపిణీ చేస్తున్న నాయకులు

'స్త్రీ శక్తి' కింద 100 మందికి కుట్టు మిషన్లు

ప్రజాశక్తి - మంగళగిరి

మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షులు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో ధ్రుపత్రాలతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 57వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 100 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ నియోజకవర్గ మహిళల స్వయం ఉపాధే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి ఆషాబాల, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, నియోజకవర్గ అంగన్వాడీ సెల్ అధ్యక్షులు గడ్డం లక్ష్మీసామ్రాజ్యం పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ, సర్పంచ్ రమాదేవి

వెద పద్ధతిలో వరిసాగు లాభసాటి

ప్రజాశక్తి - తెనాలిరూరల్

వెద పద్ధతి ద్వారా విత్తనాలు నాటాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమ్‌సాగర్ సూచించారు. పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి ఆధ్వర్యంలో రైతులకు శనివారం విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై ఇచ్చే వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చెప్పారు. ఏవో మాట్లాడుతూ వరి విత్తే సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరన్నారు. కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బండెంజిమ్ కలిపి 24 గంటలు తరువాత పిచికారీ చేయాలని చెప్పారు. కిలో విత్తనానికి 8 గ్రాముల సూడోమోనాస్ అయిన కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాలడుగు సురేంద్ర, జాస్తి నరేంద్రనాథ్, ఆర్ లక్ష్మణ్, పంచాయతీ సెక్రటరి కె.రామసుబ్బారావు, విఎఎ హెూగ్గో ఏంజిల్ పాల్గొన్నారు.

'కొత్త చట్టాల అమలు ఇప్పుడే వద్దు'

ప్రజాశక్తి-తెనాలి

కేంద్ర ప్రభుత్వం చేసిన చట్ట సవరణలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయని, అయితే పోలీసు వ్యవస్థలో సంస్కరణలు, ప్రజాభిప్రాయ సేకరణ అనంతరమే వాటిని అమల్లోకి తేవాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షులు, న్యాయవాది దరిశి శివకోటేశ్వరరావు కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఐపిసి, సిఆర్‌పిసి, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు పేర్లను కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. ఐపిసిని భారతీయ న్యాయ సంహితగా, సిఆర్‌పిసిని భారతీయ నాగరిక సురక్ష సంహితగా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టును భారతీయ సాక్షా అభినియమ్‌గా మార్చిందన్నారు. ఈ చట్టంలో జీరో ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్ ఎఫ్ఐఆర్‌తో ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. సంఘటన జరిగిన పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదని, ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఫోన్, ఈ మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. పెళ్లి చేసుకుంటానని, నమ్మించి మోసం చేయటం, మహిళలకు లైంగిక వేదింపులు తీవ్రమైనా నేరాలుగా పరిగణిస్తారని వివరించారు. యాక్సిడెంట్ జరిగిన విషయాన్ని సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అయితే ఈ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించకుండా అమల్లోకి తేవటం సరికాదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలీస్ వ్యవస్థలో సంస్కరణల అనంతరమే చట్టాలను అమల్లోకి తేవాలన్నారు. సమావేశంలో రావూరి శివశంకరరావు, అబ్దుల్ ఆరిఫ్, సోమయ్యశాస్త్రి, వాకా పేరిరెడ్డి, కొమ్ము అబ్రహాం లింకన్, చెరుకూరి శివరామయ్య, వై.రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దరిశి శివకోటేశ్వరరావు

కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-గుంటూరు

కోడిగుడ్డు సత్రం హాస్టల్ పనులు పూర్తిచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు వసతి కల్పించాలని హాస్టల్‌ను గురుకుల విద్యాలయంగా మార్పుచేసి, అన్ని హంగులతో భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని భీమ్‌భారత్ నాయకులు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం మంత్రికి భీమ్‌భారత్ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఏ.సీ. కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవనం పనులు పున:ప్రారంభించి పేద విద్యార్థులకు గ్రూప్-1, గ్రూప్-2 ఇతర పోటీ పరీక్షలకు సిద్ధం కావటానికి శిక్షణనిచ్చే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. సమ్మర్‌పేట వద్ద క్రిస్టియన్ భవన్ నిర్మాణం పనులు మధ్యలో నిలిపివేసి నిరుపయోగంగా ఉన్న భవనాన్ని పరిశీలించి పనులు ప్రారంభించి వాడుకులోకి తీసుకురావాలన్నారు. దళిత క్రైస్తవులకు ఆనందపేట వద్ద శ్మశాన వాటికలో ఖననానికి ఇబ్బంది పడుతున్న క్రమంలో 2013లో అప్పటి ప్రభుత్వం గోరంట్ల వద్ద 11 ఎకరాల భూమిని కేటాయించిందని, అయితే ఆ భూమి దళితులకు అసైన్ చేసి పట్టాలిచ్చిన కారణంగా వివాదంలో ఉండటంతో చనిపోయిన వారిని పూడ్చటానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని గుంటూరు స్వర్ణభారతి నగర వద్ద స్మశాన స్థలాన్ని కేటాయించి గుంటూరు దళిత క్రైస్తవులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రకాష్, బీసీ మహాజన సమితి రాష్ట్ర అధ్యక్షులు యు.సాంబశివరావు, బహుజన నాయకులు డెన్నిస్ రాయ్, చార్వాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్. బిసి బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహారావు ఉన్నారు.

పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

డిజిపిని కలిసిన దిలీప్ రాజా

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : డిజిపి ద్వారక తిరుమలరావును ఆయన కార్యాలయంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా శనివారం కలిశారు. మూవీ ఆర్టిస్ట్ అసోసి యేషన్ ఆంధ్ర ప్రదేశ్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. తన దర్శకత్వంలో నిర్మాణంలో ఉన్న జగ్జీవన్‌ఆరమ్ సినిమాలో టైటిల్ రోల్ పోషిస్తున్న మిలటరీ ప్రసాద్, లాల్ బహదూర్ శాస్త్రిగా నటిస్తున్న ఉత్తరప్రదేశ్ నటుడు అమీర్ చౌదరి, సహాయ దర్శకుడు వెంకి రావణ్‌ను డిజిపికి పరిచయం చేశారు. తెనాలి మా-ఎపి కార్యాలయ సందర్శనకు డిజిపిని ఆహ్వానించారు.

అంగన్వాడి బాట.. బంగారు బాట ..

ప్రజాశక్తి - తాడికొండ

అంగన్వాడి బాట బంగారు బాట అని ఐసిడిఎస్ తాడికొండ సూపర్వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. శనివారం తాడికొండలోని వైసీ కాలనీలో అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించగా కృష్ణకుమారి మాట్లాడారు. మూడేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు వల్ల పిల్లలలో సమగ్ర వికాసానికి పునాదులు వేస్తాయని ఆటపాటలతో ఆహ్లాద భరిత వాతావరణంలో ప్రీస్కూల్ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. అంగన్వాడి కిట్ ఉపయోగాలను వివరించారు. అనంతరం తల్లులు పిల్లలు అంగన్వాడి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు మంగమ్మ, సుబ్బాయమ్మ, జాస్మిన్ రోజా, శివపార్వతి, రజని, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్ నేతృత్వంలో తన్నీరు కోటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు తన్నీరు రవీంద్ర సహకారంతో పట్టణంలోని రైల్వే స్టేషన్, ఇతర జనసాంద్రత ఉన్న ప్రదేశాల్లో యాచకులు, నిరాశ్రయులకు శనివారం అన్నదానం చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి జి.పవన్, సభ్యులు సిహెచ్.సింహాద్రి, పి.గోపిభాస్కర్, వంశి, కృష్ణవేణి, వాటర్ ప్లాంట్ అధినేత ఎం.నాగరాజు పాల్గొన్నారు.

4న వంగవీటి మోహనరంగా జయంతి

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి ఆటో నగర్‌లోని కాపు సంక్షేమ సేన కార్యాలయంలో 4వ తేదీ ఉదయం 10 గంటలకు వంగవీటి మోహనరంగా 77వ జయంతిని నిర్వహిస్తామని కాపు సంక్షేమ సేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు తిరుమలశెట్టి కొండలరావు తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించి విలేకర్లతో మాట్లాడారు. జయంతి కార్యక్రమానికి తెలగ, బలిజ, కాపు జేఏసీ సౌత్ ఇండియా కన్వీనర్ దాసరి రాము ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో జనసేన నాయకులు కె.సుందరయ్య, బి.నాగేశ్వరరావు, వి.మహేష్, పి.దుర్గారావు, ఎల్.శ్రీనివాసరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాసరావును కలిసిన సుందరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ శనివారం సత్కరించారు. ప్రభుత్వానికి, పార్టీకి వారధిగా పని చేయాలని కోరారు. నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, భాస్కర్, వెంకన్న, గోపి, మస్తాన్, బాజీ, యేసుబాబు, శ్రీనివాసరావు, పి.నరేంద్ర పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ పుస్తకాల గదికి తాళం వేస్తున్న అధికారులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు

- పుస్తకాలు, యూనిఫాం అక్కడే కొనాలని ఒత్తిళ్లు
- నిబంధనలు మీరడంపై ఎఇంఒలకు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారులకు నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్, మండల అధ్యక్షులు రోహిత్ మాట్లాడుతూ పిడుగురాళ్ల మండలంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు ప్రభుత్వ నిబంధనలనూ పట్టించుకోకుండా పుస్తకాలను తమ పాఠశాలలోనే తీసుకోవాలంటూ హుకుం జారీ చేశారని చెప్పారు. విద్యాసంస్థలపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని నారాయణ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎఫ్ఐ నాయకులు ఫోన్ చేయగా వారు అక్కడికెళ్లి ఆందోళన చేయడంతోపాటు ఎంఇఒకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చారు. అనంతరం పుస్తకాల రూమును సీజ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సంతోష్, లక్ష్మారెడ్డి, వెంకట్ ఉన్నారు.

మలేరియా నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

మలేరియా మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరులోని శ్రీనివాసరావుతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు మొదలైన దృష్ట్యా పరిసరాల్లో నీరు నిలబడటం వల్ల, ఆ ప్రదేశాలు దోమలకు ఆవాసాలుగా మారుతాయని, వాటిని తరచుగా శుభ్రపరచుకుంటూ ఉండాలని, ఇళ్లలోని గాబులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, టైర్లు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన టీ కప్పులు, పాత రోళ్లలో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో నివారణ చర్యలను తరచుగా చేపట్టాలని సూచించారు. సాయంత్రం పూట, వేపపొగ పెట్టటం, దోమతెరలు వాడటం లాంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమకాటు నుంచి నివారించుకోవచ్చని తెలిపారు. తద్వారా మలేరియాను నివారించుకోవచ్చని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని అన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, దోమల నివారణ చర్యలపై ప్లకార్డులు చేతబూని, స్లోగన్స్ ఇచ్చుకుంటూ, పట్టణ ఆరోగ్యకేంద్రం నుంచి ప్రారంభమై శ్రీనివాసరావుతోట ప్రధాన కూడళ్ల ద్వారా కొనసాగి తిరిగి ఆరోగ్య కేంద్రానికి చేరుకుంది. కార్యక్రమంలో సుబ్బరాయణం, జిల్లా మలేరియా అధికారి, రాజునాయక్ అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, ప్రశాంత్, సబ్ యూనిట్ ఆఫీసర్, సూదా.శివగణేష్, ఆరోగ్య విస్తరణ అధికారి, సుకుమార్, సూరి పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- గుంటూరు

వెంకటేశ్వరరావును అభినందిస్తున్న ఎమ్మెల్యేలు, డిఇఒ తదితరులు

విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, అధికారిగా పలు హోదాల్లో పనిచేసి, అందరి మన్ననలు పొందిన అధికారి వీసం వెంకటేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. గుంటూరు తూర్పు, పశ్చిమ మండల విద్యాశాఖ అధికారి వీసం (వీరిశెట్టి) వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ శనివారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ కల్పలత, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఎంఇఒ సేవలను కొనియాడారు. తన వృత్తి జీవితంలో విద్యాశాఖలో విశిష్ట సేవలు అందించి, మృధు స్వభావిగా అందరి మన్ననలు పొందారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే వారని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. సభలో సమగ్ర శిక్ష ఎపిసి విజయలక్ష్మి, ఉర్దూ డిఐ ఖాసిం, మేకల రవీంద్రబాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల డైరెక్టర్లు పాల్గొని ఎంఇఒ వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు

మాస్టర్‌మైండ్స్ మోహన్‌కు కేంద్ర మంత్రి చంద్రశేఖర్ పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ జన్మదినం సందర్భంగా శనివారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మట్టుపల్లి మోహన్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

మోహన్‌కు మిఠాయి తినిపిస్తున్న మంత్రి

భయం గుప్పిట్లో పల్నాడు వైసిపి నేతలు

వీక్షణం

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుతో పల్నాడు జిల్లా వైసిపి నాయకులు భయంతో వణికిపోతున్నారు. గతంలో అధికారమే అండగా దూకుడుగా వ్యవహరించి టిడిపి నేతలు, క్యాడర్ లక్ష్యంగా దాడులు చేసిన నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని మధనపడుతున్నారు. టిడిపి నాయకులను గ్రామాల్లోకి రానివ్వకుండా అడ్డుకున్న పరిస్థితులు 2019 నుంచి 2024 వరకు కొనసాగాయి. టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిని కూడా మాచర్ల నియోజకవర్గంలోని ప్రవేశించకుండా చాలాకాలం పాటు వైసిపి నాయకులు అడ్డుకున్నారు. ఇందుకు అప్పటి పోలీసు అధికారులు కూడా సహకరించారు. అడ్డుచెప్పిన వారిపై దాడులు చేశారు. ఐదేళ్లలో పల్నాడు జిల్లాలో దాదాపు 20 మంది టిడిపి కార్యకర్తలు హత్యకు గురయ్యారు. వందలాది మంది గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు.

2020లో టిడిపి విజయవాడ నాయకులు బొండా ఉమ, బుద్దా వెంకన్న తదితర నాయకులు మాచర్ల నియోజకవర్గం వస్తున్న తరుణంలో పట్టణ శివారులోనే వైసిపి నాయకులు తురకా కిషోర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు దాడి చేశారు. ఆ తరువాత ఆయన వైసిపి నుంచి మాచర్ల మునిసిపల్ ఛైర్మన్ అయ్యారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉన్న తురకా కిషోర్ ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. రామకృష్ణారెడ్డి నిర్వహించిన చట్టవ్యతిరేక కార్యకలాపాలలో కిషోర్ కీలక భూమిక పోషించారు. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణల్లో ఆయనపై కూడా కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన, వారి అనుచరులంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మాచర్ల నియోజకవర్గంలో ఆత్మకూరు, జంగమేశ్వరపాడు, గుండ్లపాడు తదితర గ్రామాల్లో వైసిపి నాయకులు, ముఖ్యకార్యకర్తలు గ్రామాలు విడిచి వెళ్లిపోయారు. గురజాల నియోజకవర్గంలో పిన్నెల్లి, పాత గణేశునిపాడు, మాచవరం, పిడుగురాళ్ల ప్రాంతాల నుంచి కొంతమంది వైసిపి నాయకులు ఆయా ప్రాంతాలను విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అధికారంలో ఉండగా టిడిపి వారిపై దాడులకు పాల్పడిన నేపథ్యంలో ఇప్పుడు టిడిపి వారు తమపై దాడులకు పాల్పడతారనే భయంతో స్వస్థలాలు విడిచి కుటుంబాలతో సహా ఇతర జిల్లాలకు పారిపోయారు.

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రస్తుతం జైలు పాలు కాగా గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా నర్సరావుపేట దాటి నియోజకవర్గంలోకి రావడం లేదు. వైసిపి ఓటమికి పార్టీ అధినాయకుల వ్యవహారశైలి కారణమని మహేష్‌రెడ్డి ఇటీవల ఒక వీడియో విడుదల చేశారు. వైసిపి పాలనలో లోపాలను ఆయన ఓటమి తరువాత ఎత్తిచూపారు. అధికారంలో ఉండగా అధినాయకత్వాన్ని కనీసం ప్రశ్నించకుండా ఓడిపోయిన తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి, ధనంజయ్‌రెడ్డికి చెప్పినా వినలేదని వ్యాఖ్యానించడం కార్యకర్తల్లో అసంతృప్తికి దారితీసింది. అంతేగాక గురజాలలో తాను ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మహేష్‌రెడ్డి చేసిన ప్రకటనకు కట్టుబడి ఉండాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సవాల్ విసిరారు. దీనిపై మహేష్ రెడ్డి స్పందించలేదు.

గురజాల, మాచర్ల, నరసరావుపేట, వినుకొండ, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పోలీసులను ఉపయోగించుకుని టిడిపి కార్యకర్తలపై తీవ్ర వేధింపులకు పాల్పడిన వైసిపి నాయకులంతా ఇప్పుడు కంగారు పడుతున్నారు. టిడిపికి చెందిన అనేక మందిని బలవంతంగా వైసిపిలో చేర్చుకోవడానికి పోలీసులను కూడా ఉపయోగించుకున్నారు. పోలీసులతో తమ భర్తలు, కుమారులను వేధింపులకు గురిచేసిన ఘటనలపై ప్రస్తుతం బాధిత కుటుంబాలకు చెందిన మహిళలు కూడా వైసిపికి చెందిన వారి సంగతి చూడాలని పురుషులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో చాలామంది గ్రామాలు, పట్టణాలు విడిచి వెళ్లిపోయారు. ప్రధానంగా ఎమ్మెల్యేలకు ముఖ్య అనుచరులుగా ఉన్నవారుకూడా చాలామందికి ప్రస్తుతం కంటిమీద కునుకు కరువైంది.

(ఎ.వి.డి.శర్మ)

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!



ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ